క్లుప్తంగా

సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటే నేరమా?



రాజానగరంలో ప్రగడ చక్రికి నోటీసు ఇస్తున్న పోలీసు

రాజానగరం: ప్రస్తుతం సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తున్న తరుణంలో రాజకీయ పార్టీలు కూడా దీనిని వినియోగించుకుంటున్నాయి. నియోజకవర్గంలో సోషల్ మీడియాలో వైఎస్సార్ సీపీ పరంగా పోస్టులు పెట్టే వ్యక్తులకు పోలీసులు నోటీసులు జారీ చేయడంతో ప్రజలు నివ్వెరపోతున్నారు. రాజానగరంలో వైఎస్సార్ సీపీకి చెందిన ప్రగడ చక్రికి పోలీసులు నోటీసు ఇచ్చారు. సోషల్ మీడియా, వాట్సప్ గ్రూప్‌ల్లో వ్యక్తిగతమైన, రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టులు పెడుతున్నారని, అలా చేయడం వల్ల గొడవలకు తావిచ్చి, శాంతిభద్రతలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు తలెత్తుతున్నాయని, ఈ కారణంగా చట్టపరంగా ఎందుకు చర్యలు తీసుకోకూడదంటూ పోలీసులు ఆ నోటీసుల్లో స్పష్టం చేశారు.

విలేకరిపై కేసు

అనపర్తి: సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టు పెట్టారంటూ అనపర్తికి చెందిన ఓ పత్రికా విలేకరి పిల్లారిశెట్టి సాయిప్రకాష్‌ను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. తమ నాయకుడిని కించపర్చేలా పోస్టు పెట్టారని టీడీపీ కార్యకర్త సబ్బెళ్ల సత్యనారాయణరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడిని అదుపులోకి తీసుకుని, స్టేషన్ బెయిల్‌పై వదిలారు.

స్టీలు తలుపుల ఏర్పాటు

రంగంపేట: చంద్రేడు గ్రామంలో ఉన్న కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో ఉన్న గణపతి, అమ్మవారి ఆలయాలకు స్టీలు తలుపులు ఏర్పాటు చేసినట్టు ఆయన అర్చకుడు ఎం.కృష్ణ ఆదివారం తెలిపారు. ఈ స్టీలు తలుపులకు రూ. 32 వేలు ఖర్చయిందని, దాతల సహకారంతో వీటిని ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

పోలీసుల రాకతో దొంగలు పరారీ

సీతానగరం: పోలీసులు సకాలంలో స్పందించడంతో మునికూడలిలో దొంగతనం జరగకుండా అడ్డుకోగలిగారు. ఇద్దరు దొంగలు ఇంటిలోకి చొరబడి చోరీకి పాల్పడగా, స్థానిక పోలీసులు వెంటనే స్పందించడంతో దొంగలు పరారైన సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మునికూడలికి చెందిన కొంగల శివ సూర్యభాస్కర రావు అనారోగ్యం కారణంగా వైద్య సేవల కోసం కుటుంబ సమేతంగా హైదరాబాద్ వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో ఆదివారం తెల్లవారుజామున ఇంటిలో చప్పుడు కావడంతో, పొరుగున ఉంటున్న రాయంకుల రామచంద్ర 112కు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు హుటాహుటిన మునికూడలి వెళ్లగా, దొంగలు తమ మోటార్ సైకిల్ వదిలి పరారయ్యారు. ఇంటి తాళం పగులగొట్టి, బీరువా తెరిచి ఉంది. పోలీసులు చేరుకోవడంతో ఎటువంటి వస్తువులు, నగదు చోరీ కాలేదు. ఎస్సై డి.రామ్‌కుమార్ క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. ఎస్సై మాట్లాడుతూ, గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతుంటే 94409 04832కు సమాచారం అందించాలన్నారు. తాళం వేసి ఊళ్లకు వెళ్లేవారు విలువైన వస్తువులు భద్రపర్చుకోవాలన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు సంప్రదిస్తే ఇంటిలో ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను ఉచితంగా అమర్చుతామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

యువ కవి ధర్మేష్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న ధర్మేష్

సీతానగరం: బొబ్బిల్లంకకు చెందిన యువ కవి, విద్యా, సామాజికవేత్త నక్కిన ధర్మేష్ యువ సాహితీ కిరీటీ జాతీయ ప్రతిభా అవార్డును ఆదివారం అందుకున్నారు. హైదరాబాద్ బిర్లా ఆడిటోరియంలో సాహితీ పట్టాభిషేక మహోత్సవంలో శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్, గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్, ప్రపంచ తెలుగు సంస్కృతి కళావేదిక, తెలుగు రైటర్స్ అకాడమీ సంయుక్తాధ్వర్యంలో ఈ అవార్డును అందించారు.

వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్ నేడు ఆవిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు పార్టీ కార్యకర్తల కోసం రూపొందించిన డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుంది. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

సమాజ పటిష్టతకు..

- చురుగ్గా 'పోషణ్ మా' మాసోత్సవం
- వచ్చే నెల 16 వరకూ నిర్వహణ
- ఆరోగ్యాన్ని పెంపొందించేలా అవగాహన కార్యక్రమాలు
- చిన్నారులు, తల్లులు, బాలింతలకు పోషకాహారాల అందజేత



కోరుకొండ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో సీడీపీఓ సంధ్యారాణి



శ్రీరంగపట్నంలో బాలింతకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోరుకొండ: మహిళ ఆరోగ్యంగా ఉంటే ఇల్లు ఆనందంగా ఉంటుంది. ఇల్లు సంతోషంగా ఉంటే.. సమాజం పటిష్టంగా ఉంటుంది. దీనిని ప్రధానోద్దేశంగా తీసుకుని శిశు సంక్షేమ శాఖలోని అంగన్‌వాడీ విభాగం ఆధ్వర్యంలో పోషణ్ మా మాసోత్సవాలు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం దోహదపడుతోంది. ఈ నెల 17న ప్రారంభమైన ఈ బృహత్తర కార్యక్రమం వచ్చే నెల 16వ తేదీ వరకూ కొనసాగుతుంది. గర్భిణులు, బాలింతలతో పాటు, ప్రతి ఒక్కరికీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో బాల్యవివాహాలు, లింగవివక్ష నిర్మూలన, పోక్సో చట్టంపై అవగాహన తదితర అంశాలున్నాయి. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన, వైద్య, ఆరోగ్య శాఖతో పాటు అంగన్‌వాడీలు సంయుక్తంగా ఆయా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులతో పాటు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని అందిస్తున్నారు. ఐసీడీఎస్ కోరుకొండ ప్రాజెక్టు పరిధిలో కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల్లో 228 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో 8,571 మంది చిన్నారులున్నారు. అలాగే 939 మంది గర్భిణులు, 669 మంది బాలింతలు ఉన్నారు. వీరి ఆరోగ్య సంరక్షణకు పోషక పదార్థాలను అందిస్తున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

ఐసీడీఎస్ విభాగానికి చెందిన అంగన్‌వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలు, ఆయాలు పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చిన్నారులు, వారి తల్లులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన ఆరోగ్యం కోసం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కోరుకొండ ప్రాజెక్టు పరిధిలోని కోరుకొండ. సీతానగరం, గోకవరం మండలాల్లో 4,642 మంది మూడేళ్లలోపు పిల్లలు, 3,929 మంది మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులున్నారు. అలాగే 939 మంది గర్భిణులు, 669 మంది బాలింతలకు చిరు ధాన్యాలతో కూడిన ఆహారాన్ని అందించేలా కార్యక్రమాలు రూపొందించారు.

పెరుగుతున్న బాల్య వివాహాలు

బాల్య వివాహాలపై ప్రజల్లో ఇంకా పూర్తి అవగాహన కొరవడింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు ఇంకా కొనసాగుతున్నాయి. యుక్త వయస్సు రాకుండా పెళ్లి చేయడం వల్ల వారికి అనేక అనారోగ్య సమస్యలూ తలెత్తుతున్నాయి. కోరుకొండ ప్రాజెక్టు పరిధిలోని కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల్లో గతేడాది కాలంలో 40 బాల్య వివాహాలు చోటుచేసుకున్నట్టు సమాచారం. గుట్టుచప్పుడు కాకుండా పెళ్లిళ్లు జరిపించడం, ఆనోటా ఈనోటా విషయం బయటకు పొక్కితే.. రాజకీయ ఒత్తిళ్లతో వాటిని అణగదొక్కుతున్నట్టు తెలిసింది. సమాజంలో మహమ్మారిలా పట్టిపీడిస్తున్న బాల్య వివాహాలను సమూలంగా నిర్మూలించడానికి కేవలం అవగాహన కార్యక్రమాలే కాకుండా, సంబంధిత అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం



పోషణ్ మా కార్యక్రమాన్ని వచ్చే నెల 15వ తేదీ వరకు నిర్వహిస్తాం. నిత్యం జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులకు బాలామృతం. గుడ్లు, పాలు, గర్భిణులు, బాలింతలకు మూడు కిలోల బియ్యం. కిలో కందిపప్పు, అర లీటరు నూనె కూడా అందిస్తున్నాం. అలాగే చక్కెర, నూనె వినియోగాన్ని తగ్గించుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం.

– డి.సంధ్యారాణి, సీడీపీఓ, ఐసీడీఎస్, కోరుకొండ ప్రాజెక్ట్

రక్తహీనత నివారించాలి



వ్యవసాయ కూలీలు, తాపీ పనులు చేస్తూ జీవనం సాగించే మహిళల్లో రక్తహీనత సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. వీరికి పోషణ కిట్లతో పాటు, సహాయక చర్యలు చేపట్టాలి. బాల్య వివాహాలను అరికట్టేందుకు పటిష్టమైన కార్యచరణ చేపట్టాలి.

– ముదే సింధూ దివ్య, సర్పంచ్, కోటి కేశవరం

చలో రాజమహేంద్రవరం రేపు



సాంబత్తుల చంటి

అనపర్తి: విద్య, వైద్య సదుపాల విషయంలో కూటమి ప్రభుత్వ నిరంకుశ విధానాలను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం రాజమహేంద్రవరంలో జరిగే నిరసనకు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ఎస్సీ నాయకులంతా తరలిరావాలని పార్టీ ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సాంబత్తుల చంటి ఆదివారం పిలుపునిచ్చారు. పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కనకారవు, సాలి వేణు సారథ్యంలో ఈ నెల 30న ఉదయం తొమ్మిది గంటలకు రాజమండ్రి కార్పొరేషన్ కార్యాలయం వద్దనున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈ నిరసన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

సూర్యదేవుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధిలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ, అన్న సమారాధన జరిగాయి.

భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి



దొడ్డిగుంటలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మరిడయ్య తదితరులు

రంగంపేట: స్వాతంత్ర్య విప్లవ యోధుడు సర్దార్ భగత్‌సింగ్‌ను నేటి రాజకీయ నాయకులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రముఖ రాజకీయ, సినీ విశ్లేషకుడు అడబాల మరిడయ్య సూచించారు. మండలంలోని దొడ్డిగుంట గ్రామంలో ముత్యాలమ్మ గుడి వద్ద ఆదివారం నిర్వహించిన భగత్‌సింగ్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనుషులను అంతమొందించారేమో కానీ, వారి ఆశయాలను అంతమొందించలేరని చాటి చెప్పిన విప్లవ వీరుడు సర్దార్ భగత్‌సింగ్ అని కొనియాడారు. ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదంతో స్వేచ్ఛా కాంక్షను రగిల్చి, స్వరాజ్య సాధన పోరాటంలో చిరుప్రాయంలోనే ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన మహా యోధుడు భగత్‌సింగ్ అన్నారు. ఆయన పేరు వింటే యావత్ భారతీయ రక్తం గర్వంతో ఉప్పొంగుతుందన్నారు. భగత్‌సింగ్ భారతదేశంలో సమ సమాజ స్థాపన జరగాలని కలలు కన్నారన్నారు. మతవాదులపై ఉదాసీనత ప్రమాదకరమని భగత్‌సింగ్ బోధించారన్నారు. ఈ కార్యక్రమంలో బాల గణపతి ఆలయ కమిటీ చైర్మన్ వెలమర్తి వెంకటేశ్వరరావు, పేపకాయల వెంకన్న, చప్పిడి వీరబాబు, వారా సురేష్‌బాబు, వారా చిన్ని, ఇజ్జిన నర్సయ్య, చెలబోయిన గోవిందు, చెలబోయిన రవి, కొండేపూడి చిరంజీవి, అడబాల బుల్లిరాజు, చంద్రమళ్ల మధు పాల్గొన్నారు.

మంచి జీవనంతో హృద్రోగాల నుంచి రక్షణ

- వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్
- వరల్డ్ హార్ట్ డే సందర్భంగా త్రీ కే రన్



త్రీ కే రన్‌లో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: జీవితంలో మంచి ఆహారపు అలవాట్లు, నిత్య వ్యాయామం ద్వారా గుండె సంబంధిత వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక తిలక్‌రోడ్‌లోని విజయ భారతి చెస్ట్ ఇనిస్టిట్యూట్, పల్స్ హాస్పిటల్ సంయుక్తాధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే సందర్భంగా త్రీ కే రన్ నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో గుండె సంబంధ వ్యాధులపై అవగాహన వాక్ నిర్వహించారు. ముఖ్య అతిథులు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, డాక్టర్ శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. తిలక్ రోడ్డు నుంచి వేంకటేశ్వర నగర్‌లో ఉన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యాలయం వరకు వాక్ కొనసాగింది. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, వ్యాయామం చేసి, ఆహారపు అలవాట్లు మార్చుకుని గుండెను భద్రపరుచుకోవాలని సూచించారు. పల్స్ అధినేత డాక్టర్ వంశీకృష్ణంరాజు మాట్లాడుతూ, గుండె వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుండె వైద్య నిపుణులతో హృదయ పరీక్ష చేయించుకోలన్నారు. జీవితంలో తప్పనిసరిగా ఒక్కసారి లైపో ప్రోటీన్ల స్థాయిలను చెక్ చేయించుకోవాలని సూచించారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు



అనపర్తి త్రిశక్తి పీఠంలో మహాచండీ అవతారంలో..



తుర్కవీధి పీఠంలో అమ్మవారు



చంద్రేడులో కాత్యాయనీ అమ్మవారు



రంగంపేటలో విజయదుర్గ అమ్మవారు



బిక్కవోలులో పార్వతీదేవి అమ్మవారు



కొమరిపాలెంలో కనకదుర్గమ్మ తల్లి



సంపరలో చండీమాత అవతారంలో విజయదుర్గా అమ్మవారు

లోకరక్షకీ.. పాహిమాం

- భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్ర ఉత్సవాలు
- మహాచండీగా అమ్మవారు



త్రిశక్తి పీఠానికి చీర సారెను ఎడ్లబండిలో తీసుకువస్తున్న భక్తులు



బిక్కవోలులో కలశాలతో అమ్మవారి గ్రామోత్సవం

రంగంపేట: పవిత్ర శరన్నవరాత్ర ఉత్సవాలు ఏడో రోజైన ఆదివారం మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రంగంపేటలోని దేవీ సెంటర్, స్థానిక ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారిని మహాచండీగా అలంకరించారు. ఆలయ అర్చకులు నాగేంద్రశర్మ ప్రత్యేక పూజలు చేశారు. అల్లం గారెలు నైవేద్యంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు అమ్మవారిని వెండి, బంగారు ఆభరణాలు, గజమాలలతో అలంకరించారు. చంద్రేడులోని కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో అమ్మవారిని మహాచండీగా అలంకరించారు. ఉదయం అమ్మవారికి వెండి, బంగారు నగలతో అలంకరించారు. దొంతమూరులోలోని మెయిన్ రోడ్డులో విజయదుర్గాదేవి నవరాత్ర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈలకొలనులో ముత్యాలమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయాన్ని సర్వాంగసుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారి వేషధారణలు చేసి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. వడిశలేరులో ఏడీబీ రోడ్డులో కొలువైన విజయదుర్గా అమ్మవారిని మహాచండీగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. దొడ్డిగుంట, సింగంపల్లి, కోటపాడు, ముకుందవరం తదితర గ్రామాలలో ఆలయాల వద్ద అమ్మవారి మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పార్వతీదేవికి ప్రత్యేకాలంకరణ

బిక్కవోలు: పలు గ్రామాల్లో మహాచండీ దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. బిక్కవోలు గోలింగేశ్వరస్వామి ఆలయంలో ఉన్న పార్వతీదేవిని మహాచండీగా అలంకరించి, ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. పందలపాక వెలమపేట రామాలయం వద్ద శ్రీదేవి అమ్మవారిని, రాజరాజేశ్వరీ అమ్మవారిని, కొమరిపాలెం కనకదుర్గమ్మ అమ్మవారిని, ఊలపల్లిలో కనకదుర్గమ్మ తల్లి, మహాచండీ దేవి అలంకరణ చేశారు. బలభద్రపురం, కొంకుదురు, తొస్సిపూడి, ఆరికరేవుల గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో సాముహిక కుంకుమ పూజలు చేశారు. బిక్కవోలు గ్రామంలోని రాజారావుపేట మధ్య రామాలయం ఆశ్రమం భవానీల ఆధ్వర్యంలో 51 కలశాలతో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం గణపూజ, కుంకుమపూజ, అనంతరం 300 మంది భవానిలతో కలశాలతో అమ్మవారి గ్రామోత్సవం చేశారు.

సామూహిక కుంకుమ పూజలు

రాజానగరం: దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని రాధేయపాలెంలో కనకదుర్గ ఆలయం వద్ద సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. గ్రామానికి చెందిన పలువురు మహిళలు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ జగన్మాతను దర్శించుకున్నారు. చక్రద్వారబంధంలో సోమాలమ్మ గుడి వద్ద భవానీలు అగ్నిగుండం తొక్కారు. ఉదయం కంకణాలు కట్టుకుని, గ్రామంలో సాయంత్రం పేటతుళ్ల నిర్వహించారు. అనంతరం నిప్పుల గుండాన్ని ఏర్పాటుచేసి, భక్తి పారవశ్యంతో జగన్మాత నామాన్ని స్మరిస్తూ అగ్నిగుండాన్ని తొక్కారు. భక్తులు భారీగా తరలివచ్చారు.

కలశపూజ

కోరుకొండ: మండలంలోని గాడాల రాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయం వద్ద కలశ పూజ జరిగింది. అనంతరం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పడాల పండు ఆధ్వర్యంలో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు, సోమవారం సరస్వతీ అవతారంలో అమ్మవారు దర్శనమిస్తారు. విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, అట్టలను పంపిణీ చేయనున్నారు.

అరవాలమ్మ గుడి వద్ద..

సీతానగరం: మండలంలోని చీపురుపల్లి పంచాయతీలోని అచ్చయ్యపాలెంలో ఉన్న అరవాలమ్మ తల్లి గుడి వద్ద సామూహిక కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో విజయలక్ష్మిని సన్మానించారు. అనంతరం అన్న సమారాధన జరిగింది. మండలంలోని బొబ్బిల్లంక ప్రభాకర్‌నగర్ కాలనీలోని విజయ దుర్గభవానీ ఆలయంలో దీపాలంకరణ సేవ నిర్వహించారు. సింగవరం పంచాయతీ నాగరత్నం కాలనీలో కనకదుర్గ అమ్మవారి ఆలయంలో, ముగ్గళ్ల ర్యాంపు వద్ద విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయాల్లో మహాచండీ దేవి అలకంరణలో అమ్మవారు దర్శనమిచ్చారు.

ఆధ్యాత్మికంగా ఉత్సవాలు నిర్వహించాలి: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: శరన్నవరాత్రుల ఉత్సవాలు భక్తులు ఆధ్యాత్మికంగా, ఉత్సాహంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. కరకుదురు గ్రామంలో కనకదుర్గాదేవి అమ్మవారిని ఆదివారం డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ పెమ్మనబోయిడి గోవిందరాజు, నాయకులు వల్లూరి పట్టాభి, యెంద్రు సుబ్బారావు, అడబాల సత్యనారాయణ, తోటకూర శ్రీను, అల్లంబాబులు, చిట్టూరి సత్తిబాబు, ఎం.ఆదినారాయణ, అడబాల సూర్యనారాయణ, అడపా పెద్ద, అడపా జగన్, సానా సుబ్రహ్మణ్యం, పులకేసు, చంద్రు బాబు, అడబాల బుజ్జి తదితరులు పాల్గొన్నారు. అలాగే శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు దుర్గాదేవి అమ్మవారు చండీమాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జి.మామిడాడ, పెదపూడి, పెద్దాడ, రామేశ్వరం, ఏపీత్రయం, సంపర తదితర గ్రామాల్లో దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సంపర గ్రామంలో అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు సామూహిక కుంకుమ పూజలు, లలితా పారాయణ చేయించారు.

మహాచండీకి చీర సారె..

అనపర్తి: గ్రామ దేవత శ్రీవీరుళ్లమ్మ అమ్మవారిని ఓంశక్తి సత్సంగ సభ్యుల ఆధ్వర్యంలో త్రిశక్తి పీఠంలో ఆదివారం మహాచండీ దేవిగా అలంకరించారు. స్థానిక తురక వీధిలో అమ్మవారు మహాచండీగా భక్తులకు దర్శనమిచ్చారు. త్రిశక్తి పీఠం ఆధ్వర్యంలో అమ్మవారికి పుట్టింటి చీర సారెను ఎడ్లబండిలో మేళతాళాలు, నృత్యాలు, విచిత్ర వేషాలు, బాణసంచా కాల్పులతో మెయిన్ రోడ్‌లో ఊరేగింపుగా తీసుకువచ్చి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అచ్చయ్యపాలెంలో అరవాలమ్మ తల్లి ఆలయం వద్ద సన్మానం అందుకున్న జక్కంపూడి విజయలక్ష్మి



కరకుదురులో దుర్గాదేవిని దర్శించుకుంటున్న డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు



బొబ్బిల్లంకలో విజయ దుర్గభవానీ ఆలయం వద్ద దీపాలంకరణ సేవ